మోగిన హెచ్‌ఏఎల్ యూనియన్ ఎన్నికల నగారా

● ఆగస్టు 12న నామినేషన్ల స్వీకరణ ● 30న ఎన్నికల నిర్వహణ

బాలానగర్, జూలై 29(ఆంధ్రజ్యోతి): బాలానగర్‌లోని హిందూస్థాన్ ఏరోనాటికల్స్ లిమిటెడ్ (హెచ్‌ఏఎల్ -హైదరాబాద్ డివిజన్) కార్మిక యూనియన్ ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదలయింది. ఆగస్టు 30న ఎన్నికలు నిర్వహించాలని సంస్థ మేనేజ్‌మెంట్ నిర్ణయించింది. ఆగస్టు 12న నామినేషన్ల స్వీకరణ, 13 ఉపసంహరణ, 30న ఎన్నికలు నిర్వహించి అదే రోజు ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలు వెల్లడించాలని సంస్థ తీర్మానించింది. ఈ ఎన్నికల్లో సంస్థలో ఉన్న మొత్తం ఆరు యూనియన్లు తమ అదృష్టాన్ని పరీక్షించుకోవాల్సి ఉన్నప్పటికీ కొన్ని యూనియన్లు కలిసి కూటమిగా ఏర్పడనున్నట్లు కార్మిక సంఘాల నేతలో చర్చ జరుగుతోంది. సంస్థలో పనిచేసే 892 మంది కార్మికులు బ్యాలెట్ ద్వారా తమ ఓటు హక్కును వినియోగించకోవాల్సి ఉంది. వీరితో పాటుగా 56 మంది కార్మికులు (35 మంది కేరళ కాసర్‌గఢ్ కార్మికులు, 21 మంది ఔట్ స్టేషన్ కార్మికులు) పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు.

నేడు డయల్ యువర్ ఆర్టీసీ డీఎం, డీఆర్ఎం

ఫతేనగర్, జూలై 29(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీలో ప్రయాణికులు ఎదుర్కొంటున్న సమస్యలు అధికారులకు వివరించేందుకు మంగళవారం డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కూకట్‌పల్లి ఆర్టీసీ డీఎం డి.హరి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమస్యలు, సలహాలు ఇవ్వాలనుకునే ప్రయాణికులు మధ్యాహ్నం 3 నుంచి 4 గంటల వరకు ఈ 99592 26151 నంబర్‌కు ఫోన్ చేయవచ్చని ఆయన సూచించారు. అదే విధంగా కూకట్‌పల్లి డివిజన్ పరిధిలోని కూకట్‌పల్లి, జీడిమెట్ల, మియాపూర్-2, హెచ్‌సీయూ, మేడ్చల్ డిపోల పరిధిలోని ప్రయాణికుల మధ్యాహ్నం 3 నుంచి 4 గంటల వరకు డిప్యూటీ రీజనల్ మేనేజర్ ఆర్.కవితకు సమస్యలు, సలహాలు తెలిపేందుకు ప్రయాణికులు ఈ నంబర్‌కు 9959226148కు ఫోన్ చేయవచ్చని డీఆర్ఎం తెలిపారు.


సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులను పంపిణీ చేస్తున్న బండి రమేష్, వెంకటేశ్వరరావు

సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కుల పంపిణీ

హైదర్‌నగర్, జూలై 29(ఆంధ్రజ్యోతి): కూకట్‌పల్లి కేపీహెచ్‌బీ కాలనీకి చెందిన కొత్తగొల్ల రమేష్, కూకట్‌పల్లికి చెందిన సోహన్‌దాస్ అనారోగ్యానికి గురవడంతో వైద్య ఖర్చుల కోసం సీఎం రిలీఫ్‌ఫండ్‌కు దరఖాస్తు చేసుకున్నారు. దీంతో రమేష్‌కు రూ.30 వేలు, సోహన్‌దాస్‌కు రూ.12 వేలు మంజూరయ్యాయి. ఈ మేరకు సోమవారం సీఎంఆర్ఎఫ్ చెక్కులను నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి బండి రమేష్, సీనియర్ నాయకుడు గొట్టిముక్కల వెంకటేశ్వరరావు లబ్ధిదారుల కుటుంబసభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా బండి రమేష్ మాట్లాడుతూ.. అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందేలా చూస్తామన్నారు.

నేడు చలో అసెంబ్లీ


మహిళా కార్మికులతో మాట్లాడుతున్న ఏఐటీయూసీ నాయకులు

పేట్‌బషీరాబాద్, జూలై 29(ఆంధ్రజ్యోతి): ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మంగళవారం చేపట్టనున్న చలో అసెంబ్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని మున్సిపల్ నాయకులు వి.హరినాథ్‌రావు, చర్లపల్లి రాములు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అసెంబ్లీ జరుగుతున్న సందర్భంగా జీహెచ్ఎంసీలో పని చేసే కార్మికులు ఇందిరా పార్కు వద్దకు రావాలని వారు కోరారు. కార్మికుల సమస్యలను పరిష్కరించుకునేందుకు ధర్నాకు తరలిరావాలని కోరారు.

బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి..


కాంగ్రెస్‌లో చేరిన మహేష్ తదితరులు

నిజాంపేట్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాష్ట్రంలో చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారని కుత్బుల్లాపూర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్‌రెడ్డి అన్నారు. నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లో బాచుపల్లి 19వ డివిజన్ బీఆర్ఎస్ యూత్ అధ్యక్షుడు నందిగామ మహేష్ ముదిరాజ్ కాంగ్రెస్‌పార్టీ కార్యాలయంలో హన్మంత్‌రెడ్డి సమక్షంలో ఆ పార్టీలో సోమవారం చేరారు. నిజాంపేట్ కార్పొరేషన్‌లో అధ్యక్షుడు కొలన్ రాజశేఖర్‌రెడ్డి, కళ్యాణ్, రాకేష్ పాల్గొన్నారు.

క్రిస్టియన్ సంఘాల సమస్యలు పరిష్కరిస్తాం..


సమావేశంలో మాట్లాడుతున్న దీపక్‌జాన్

నిజాంపేట్, జూలై 29(ఆంధ్రజ్యోతి): క్రిస్టియన్ సంఘాల సమస్యలను పరిష్కరిస్తామని తెలంగాణ క్రిస్టియన్ సంఘ చైర్మన్ దీపక్‌జాన్ అన్నారు. నిజాంపేట్ రాక్ చర్చిలో క్రిస్టియన్ కమ్యూనిటీ వేల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పాస్టర్ల సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా ఆయన హాజరై ప్రసంగిస్తూ క్రైస్తవుల హక్కులను కాపాడుకోవాలన్నారు. ముఖ్యంగా క్రైస్తవుల సమాధి తోట, కమ్యూనిటీహాల్స్ విషయంలో తగు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో క్యూసీసీఏ చైర్మన్ పాస్టర్ శౌరి, జర్నల్‌సెక్రటరీ పాస్టర్ అబ్రహమ్, జాషువా పుచ్చకాయల, జేమ్స్, ఫెలోషిప్, జగదీశకుమార్, జ్యోతి పాల్గొన్నారు.

డిమాండ్‌కు అనుగుణంగా పవర్ ట్రాన్స్‌ఫార్మర్లు


పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌ను పరిశీలిస్తున్న ఆనంద్, వెంకన్న

హైదరాబాద్ సిటీ, జూలై 29 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ శివారు ప్రాంతాల్లో పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌కు అనుగుణంగా విద్యుత్‌శాఖ సబ్‌స్టేషన్లలో కొత్త పవర్‌ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసినట్లు రంగారెడ్డి జోన్ సీఈ పి.ఆనంద్, సైబర్‌సిటీ ఎస్ఈ పి.వెంకన్నలు తెలిపారు. సైబర్‌సిటీ సర్కిల్ గచ్చిబౌలి సబ్‌స్టేషన్‌లో ఏర్పాటు చేస్తున్న 12.5 ఎంవీఏ సామర్థ్యం కల్గిన పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌ను సోమవారం తనిఖీ చేశారు. సర్కిల్ పరిధిలో పెరుగుతున్న లోడ్‌కు తగినట్లు కొత్త పవర్ ట్రాన్స్‌ఫార్మర్లు (పీటీఆర్)లు ఏర్పాటు చేస్తున్నట్లు ఉన్నతాధికారులు తెలిపారు. వచ్చే సమ్మర్‌లో పెరిగే డిమాండ్‌ను అంచనా వేస్తూ సబ్‌స్టేషన్లలో పీటీఆర్ సామర్థ్యం పెంచడంతో పాటు అవసరమైన సబ్‌స్టేషన్లలో విద్యుత్‌శాఖ కొత్త పీటీఆర్‌లు ఏర్పాటు చేస్తోంది.

గొల్ల కురుమలను విస్మరించిన ప్రభుత్వం

నేటినుంచి ఆగస్టు 15 వరకు 'మందబాట'

బర్కత్‌పుర, జూలై 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం గొల్లకురుమలను అన్ని రంగాల్లో పూర్తిగా విస్మరించిందని గొర్రెల కాపరుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పోచబోయినన శ్రీహరియాదవ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారం తిరుపతి యాదవ్ ఆరోపించారు. గొర్రె కాపరులకు ఇచ్చిన ఏ ఒక్క హామీనీ అమలు చేయలేదని వారు ఆరోపించారు. బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. రాష్ట్ర మంత్రివర్గంలో గొల్లకురుమలకు స్థానం కల్పించాలని, నామినేటెడ్ పోస్టుల భర్తీలో ప్రాధాన్యం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈనెల 30 నుంచి ఆగస్టు 15 వరకు గ్రామాలలో గొల్లకురుమల మందబాట నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. అప్పటికీ ప్రభుత్వం స్పందించకపోతే ఆగస్టు 15 తరువాత నగరంలో లక్షలాది మందితో గొర్రె కాపరుల జనజాతర నిర్వహిస్తున్నట్లు వారు చెప్పారు. రాష్ట్రంలో యాదవ కార్పొరేషన్‌ను తక్షణమే ఏర్పాటు చేసి రూ.10వేల కోట్లను కేటాయించాలన్నారు. గొర్రెల కాపర్లకు జీవాలమేత, వైద్యం, షెడ్లు, మార్కెటింగ్ సౌకర్యం కల్పించాలని, ఇతర డిమాండ్లను కూడా నెరవేర్చాలని వారు డిమాండ్ చేశారు. సమావేశంలో సంఘం నేతలు అయోధ్య యాదవ్, వెంకటేష్ యాదవ్, శ్రీనివాస్‌యాదవ్, దేవరాజుయాదవ్, రాములుయాదవ్, చంద్రమౌళి యాదవ్, సత్యం యాదవ్, నాగరాజు యాదవ్, సమ్మయ్యయాదవ్, సాగర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఆగిపోయిన కమ్యూనిటీహాలు నిర్మాణం

ఏళ్లుగా పెండింగ్ పెడుతున్న అధికారులు


నిర్మాణం పూర్తికాని కమ్యూనిటీహాలు

ఫతేనగర్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): ఫతేనగర్ అక్షయ్ ఎన్‌క్లేవ్ పారిశ్రామికవాడలో రూ.30 లక్షల నిధులతో చేపట్టిన కమ్యూనిటీహాలు నిర్మాణం అర్థాంతరంగా ఆగిపోయింది. డిసెంబర్ 24, 2022న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు కమ్యూనిటీహాలు నిర్మాణం పనులకు శంకుస్థాపన చేశారు. మొదట పనులు సాఫీగానే సాగడంలో రెండు నెలల్లో కమ్యూనిటీహాలు నిర్మాణం పూర్తి అవుతుందని జీహెచ్ఎంసీ అధికారులు అక్షయ్ఎన్‌క్లేవ్ ఇండస్ట్రియల్ అసోసియేషన్ సభ్యులకు హామీ ఇచ్చారు. ఏమైందో ఏమో కానీ కొన్ని నెలలుగా పనులు ఆగిపోయాయి. కమ్యూనిటీహాలు నిర్మాణం విషయంపై సర్కిల్ అధికారిని అడిగితే నెల రోజుల్లో పూర్తవుతుందని చెబుతున్నారని స్థానికులు వాపోతున్నారు. వినాయక చవితిలోగా కమ్యూనిటీహాలు నిర్మాణం పూర్తి చేస్తే బాగుంటుందని స్థానికులు ఎమ్మెల్యే కృష్ణారావు, జీహెచ్ఎంసీ అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు. 18 నెలలుగా నిర్మాణ పనుల్లో ఎలాంటి పురోగతీ లేకపోవడంతో కమ్యూనిటీహాలు నిర్మాణం విషయమై డివిజన్ ఏఈ పవన్‌ను 'ఆంధ్రజ్యోతి' ప్రశ్నించగా రెండు రోజుల్లో పనులు ప్రారంభిస్తామని తెలిపారు. కానీ గడువు ముగిసినా పనులు మాత్రం ప్రారంభం కావడం లేదు.

పనులు వెంటనే పూర్తి చేయాలి



అక్షయ్ ఎన్‌క్లేవ్‌లో కమ్యూనిటీ హాలు నిర్మాణం అర్థాంతరంగా ఆగి పోయింది. ఏడాదిన్నర నుంచి పనులు జరుగడం లేదు. అవసరమైతే మరిన్ని నిధులను కేటాయించైనా కమ్యూనిటీ హాలు నిర్మాణాన్ని పూర్తి చేస్తే బాగుంటుంది.

\- దిడ్డి ప్రభాకర్, అక్షయ్ఎన్‌క్లేవ్ అసోసియేషన్ అధ్యక్షుడు

వినాయకచవితిలోగా పూర్తి చేయాలి



వినాయక చవితి రాక ముందే కమ్యూనిటీహాలు నిర్మాణం పూర్తి చేస్తే బాగుంటుంది. చవితి వేడుకలను అత్యంత వైభవంగా కొత్త కమ్యూనిటీహాలులో జరుపుకుంటే బాగుంటుందని పరిశ్రమ నిర్వాహకులందరం ఆశగా ఎదురు చూస్తున్నాం.

-జి.భాస్కర్, జనరల్ సెక్రటరీ, అక్షయ్ఎన్‌క్లేవ్

ప్రజలకు ఎంతో మేలు



అక్షయ్ ఎన్‌క్లేవ్‌లో కమ్యూనిటీ హాలు వస్తుందని ఎంతో ఆశపడ్డాం. హాలు నిర్మాణం పూర్తయితే ఎన్నో కార్యక్రమాలు, అవగాహన సదస్సులు నిర్వహించుకునే వీలుంటుందని సంబరపడ్డాం. కానీ కమ్యూనిటీహాలు పనులు అటకెక్కడంతో నిరాశకు గురయ్యాము. ఇప్పటికైనా అధికారులు స్పందించి నిర్మాణం పనులు పూర్తి చేయాలి.

\- సౌమ్య, గృహిణి అక్షయ్ ఎన్‌క్లేవ్


మాట్లాడుతున్న భూలక్ష్మీ ఆలయ చైర్మన్ బాబుగురు

అకారణంగా దాడి చేసిన ఎస్సై, కానిస్టేబుల్‌పై చర్యలు తీసుకోవాలి

అఫ్జల్‌గంజ్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): బోనాల ఉత్సవాల సందర్భంగా ముస్లింజంగ్‌పూల్ వంతెన వద్ద షాహినాథ్‌గంజ్ ఎస్సై రాజేశ్వర్‌రెడ్డి, కానిస్టేబుల్ నరేశ్‌చౌహాన్ తనపై అకారణంగా లాఠీలతో దాడిచేసి తీవ్రంగా గాయపరిచారని భూలక్ష్మీ దేవాలయం చైర్మన్ వై.బాబుగురు పేర్కొన్నారు. వారిపై నగర పోలీసు కమిషనర్ చర్యలు తీసుకోవాలని బాబుగురు డిమాండ్ చేస్తున్నాడు. ఈ మేరకు సోమవారం ఆలయం వద్ద వై.బాబుగురు, కార్పొరేటర్ లాల్‌సింగ్, బీజేపీ నాయకులు గోవింద్‌రాఠీ, శ్రీరాంవ్యాస్, జిఘ్నేశ్‌జోషి, మాజీ కార్పొరేటర్ మెట్టు వైకుంఠం, రాజేశ్‌తో కలిసి విలేకర్ల సమావేశం నిర్వహించారు. అనంతరం బాబుగురు మాట్లాడుతూ.. 1972 నుంచి బోనాల ఉత్సవాల సందర్భంగా అమ్మవారి ఊరేగింపును అధికారికంగా (పోలీసు పర్మిషన్‌తో) నిర్వహిస్తామని తెలిపారు. సోమవారం అర్ధరాత్రి ఊరేగింపు కొనసాగుతుండగా ఎస్సై రాజేశ్వర్‌రెడ్డి, కానిస్టేబుల్ నరేశ్ చౌహాన్ ఊరేగింపును నిలుపుదల చేసి తనతో వాగ్వాదానికి దిగి లాఠీలతో కాళ్లు, చేతులపై కొట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై నగర పోలీసు కమిషనర్, రాష్ట్ర డీజీపీకి ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.

నిర్వహణను పట్టించుకోని హాస్టళ్లను మూసివేయాలి

● డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి జావిద్

హైదరాబాద్ సిటీ, జూలై 29 (ఆంధ్రజ్యోతి): నిర్వహణను పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ప్రైవేట్ హాస్టళ్లను మూసివేయాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి జావిద్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నగరంలోని అమీర్‌పేట్, చిక్కడపల్లి, అశోక్‌నగర్, దిల్‌సుఖ్‌నగర్‌లో ప్రభుత్వ ఉద్యోగాల కోసం కోచింగ్ తీసుకునేందుకు వచ్చిన నిరుద్యోగుల జీవితాలతో హాస్టల్ నిర్వాహకులు చెలగాటమాడుతున్నారని ఆరోపించారు. కనీస వసతులు కల్పించకున్నప్పటికీ నెలకు వేలాది రూపాయలు వసూలు చేస్తున్నారన్నారు. ఢిల్లీలో జరిగిన ఘటనను దృష్టిలో ఉంచుకుని జీహెచ్ఎంసీ అధికారులు క్షేత్రస్థాయిలో తనిఖీలు చేపట్టి నిర్వహణ సరిగాలేని హాస్టళ్లను మూసివేయాలని ఆయన కోరారు.

పురస్కారాల కోసం దరఖాస్తుల ఆహ్వానం

చిక్కడపల్లి, జూలై 29(ఆంధ్రజ్యోతి): కళానిలయం సాంస్కృతిక సేవా సంస్థ ఆధ్వర్యంలో జ్ఞానపీఠ పురస్కార గ్రహీత డా.సి.నారాయణరెడ్డి జయంతి సందర్భంగా సినారె ప్రతిభా పురస్కారాలు ఈనెల 31న త్యాగరాయగానసభలో ప్రదానం చేయనున్నట్లు ఆ సంస్థ కార్యదర్శి సురేందర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సామాజిక కార్యకర్తలు, సేవాసంస్థల ప్రతినిధులు, కళాకారులు, కవులు, సంగీత, సాహిత్య, గాన, కళా, సేవా ఉపాధ్యాయ, నటీనటులు, రాజకీయ నాయకులు, వ్యాపారులు, జర్నలిస్ట్ రంగాలవారు దరఖాస్తు చేయవచ్చన్నారు. వివరాలకు 95505 12032లో తమ పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

సందడిగా ఫలహార బండ్ల ఊరేగింపు

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు బోనాలు ప్రతీక: ఎమ్మెల్యే గాంధీ


రాయదుర్గంలో నిర్వహించిన ఉత్సవాల్లో ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి, కొమిరిశెట్టి సాయిబాబా

మియాపూర్, జూలై 29(ఆంధ్రజ్యోతి): బోనాల పండుగ సందర్భంగా హఫీజ్‌పేట డివిజన్ హఫీజ్‌పేటలో నిర్వహించిన బోనాల ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన ఫలహార బండి ఊరేగింపు కార్యక్రమంలో ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకయిన బోనాల ఉత్సవాలను అందరూ కలిసి చేసుకోవడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు గౌతంగౌడ్, శ్రీనివాస్‌యాదవ్ పాల్గొన్నారు.

● **గచ్చిబౌలి డివిజన్‌లో..**

రాయదుర్గం: గచ్చిబౌలి డివిజన్ గోపన్‌పల్లి గ్రామం, గోపన్‌పల్లితండా, ఎన్టీఆర్‌నగర్‌లో జరిగిన బోనాల ఉత్సవాల్లో ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి పాల్గొన్నారు. కార్యక్రమంలో రాజు యాదవ్, ఎర్రగుడ్ల శ్రీనివాస్‌యాదవ్, ప్రసాద్, మంత్రిప్రగడ సత్యనారాయణ, రాజునాయక్, అనిల్, శ్రీశైలం, నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

● **మూసాపేట్‌లో..**

కేపీహెచ్‌బీకాలనీ: మూసాపేట్ మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన అమ్మవారి ఫలహారబండి ఊరేగింపు సోమవారం సందడిగా నిర్వహించారు. పోతురాజుల నృత్యాలు, వివిధ వేషధారణలతో కళాకారులు నృత్యాలు చేస్తూ ముందుకు సాగారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్‌కుమార్, మాజీ సర్పంచ్ తూము శ్రీనివాసరావు, సంఘం అధ్యక్షుడు తూము నర్సింగరావు, ప్రధాన కార్యదర్శి జిల్లా జీత్‌రావు, యువక మండలి అధ్యక్షుడు తూము మనోజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

● **ఫతేనగర్:** ఫతేనగర్ డివిజన్ తెనుగుబస్తీలో నిర్వహించిన బోనాల వేడుకల్లో కార్పొరేటర్ పండాల సతీష్‌గౌడ్ పాల్గొన్నారు. బస్తీ నాయకుడు కుక్కల క్రాంతి ముదిరాజ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఫలహారం బండికి పూజలు నిర్వహించారు.

● **గచ్చిబౌలి:** శేరిలింగంపల్లి డివిజన్‌లో సోమవారం ఫలహారబండ్ల ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. తారానగర్ తుల్జాభవాని అమ్మవారి ఆలయం నుంచి నెహ్రూనగర్ వరకు పలు బస్తీలలో ఊరేగింపులు కొనసాగాయి. కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్ హాజరయ్యారు. పోతురాజుల విన్యాసాలు, డప్పువాయిద్యాల నడుమ ఫలహారబండ్ల ఊరేగింపు సందడి సందడిగా సాగింది. కార్యక్రమంలో వార్డు మెంబర్ కవిత, రాంచందర్, యాదాగౌడ్, రామాచారి, రవి యాదవ్, లక్ష్మణ్‌యాదవ్, గోపాల్‌యాదవ్, శ్రీకాంత్, రవి, బాలాజీ పాల్గొన్నారు.


ఫలహారబండి ఊరేగింపులో కార్పొరేటర్ సతీష్‌గౌడ్


ఫలహారబండి ఊరేగింపులో కార్పొరేటర్ నాగేందర్‌యాదవ్



వృద్ధ మహిళతో మాట్లాడుతున్న ఇన్‌స్పెక్టర్ సీతయ్య

వృద్ధురాలిని ఓల్డేజ్‌హోమ్‌లో చేర్చిన పోలీసులు

చిక్కడపల్లి, జూలై 29(ఆంధ్రజ్యోతి): ఎవరూ లేని ఓ వృద్ధ మహిళను చిక్కడపల్లి పోలీసులు చేరదీసి ఓల్డేజ్ హోమ్‌లో చేర్పించారు. హిమాయత్‌నగర్‌కు చెందిన 70 సంవత్సరాల వృద్ధురాలు ఎరమిల్లి లాలమ్మ భర్త గతంలో చనిపోయాడు. ఆంధ్రప్రదేశ్ విజయవాడకు చెందిన ఆమె బాగోగులు చూసుకోవడానికి కుటుంబీకులు, సన్నిహితులు ఎవరూ లేరు. విషయం తెలుసుకున్న చిక్కడపల్లి ఇన్‌స్పెక్టర్ ఏరుకొండ సీతయ్య ఆమెను సోమవారం పీఎస్‌కు తీసుకువచ్చి భోజనం పెట్టించారు. ఆమెకు పాదరక్షలు ఇప్పించి ఘట్‌కేసర్‌లో ఉన్న ఓల్డేజ్‌హోమ్‌లో చేర్పించారు.

బీజేపీ కార్యాలయాన్ని ముట్టడించిన 'పాలమూరు యువగళం'

అఫ్జల్‌గంజ్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): పాలమూరు రంగారెడ్డి జిల్లా ఎత్తిపోతల ప్రాజెక్టుకు జాతీయ హోదా సాధించలేని అసమర్థ బీజేపీ ఎంపీల పనితీరుకు నిరసనగా పాలమూరు యువగళం వ్యవస్థాపక అధ్యక్షుడు టీకే. శివప్రసాద్ ఆధ్వర్యంలో సోమవారం నాంపల్లిలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయాన్ని ముట్టడించారు. బీజేపీ ఆఫీసులోకి చొచ్చుకెళ్లేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. దీంతో ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. ఆందోళనకారులు రోడ్డుపై బైఠాయించడంతో పోలీసులు అరెస్ట్ చేశారు.

'జన్మించడమే కవిత్వం' ఆవిష్కరణ


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న రమణాచారి తదితరులు

రవీంద్రభారతి, జూలై 29 (ఆంధ్రజ్యోతి): సమాజానికి ఉపయోపడే విధంగా జన్మించడమే కవిత్వం అనే పుస్తకాన్ని రచించడం అభినందనీయమని రిటైర్డ్ ఐఏఎస్ డా.కేవీ.రమణాచారి అన్నారు. సోమవారం ఆయన క్యాంప్ ఆఫీస్‌లో జీవీఆర్ ఆరాధన కల్చరల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శైలజమిత్ర రచించిన జన్మించడమే కవిత్వం పుస్తకావిష్కరణ సభ జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన రమణాచారి పుస్తకాన్ని ఆవిష్కరించి కవయిత్రిని అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ సాహితీవేత్త ఓలేటి పార్వతీశం, పొత్తూరి సుబ్బారావు, సుధామ, సీఎస్.రాంబాబు, పెద్దూరి వెంకటదాస గుదిబండి వెంకటరెడ్డి తదితరులు పాల్గొని కవయిత్రి శైలజమిత్రను అభినందించారు.


కళాకారులను సత్కరిస్తున్న అతిథులు

శాస్త్రీయ కళలు మన సంస్కృతికి నిదర్శనం

రవీంద్రభారతి, జూలై 29 (ఆంధ్రజ్యోతి): శాస్త్రీయ కళలు మన సంస్కృతి, సాంప్రదాయాలకు నిదర్శనమని వక్తలు అభివర్ణించారు. సోమవారం తెలుగు వర్సిటీలోని ఆడిటోరియంలో వెంపటి కూచిపూడి నృత్య అకాడమీ ఆధ్వర్యంలో కూచిపూడి నృత్యోత్సవం నిర్వహించారు. ప్రముఖ నాట్యగురువు వెంపటి లక్ష్మణకుమార్ నేతృత్వంలో శిష్యబృందం సీతంరాజు, ఐశ్వర్య, శ్రియ, బిందు, శృతి, చరిత, మాలిక, మైలవరపు శిరీష, మేహిత తనుశ్రీ, మనస్విని, హేమన్య, శ్రీవల్లి, హేమవర్ష, వర్షిణి, మనోజ్ఞ, హాసిని, కార్తీక్, వైష్ణవి కూచిపూడి నృత్యరూపకాలను ప్రదర్శించారు. ఈ కార్యక్రమానికి అతిథులుగా బోనాల కిరణ్మయి, గీతాలక్ష్మి, కిషోర్‌కుమార్ హాజరై కళాకారులను సత్కరించి అభినందించారు. పిల్లల్ని విద్యతో పాటు కళారంగంలో రాణించేలా ప్రోత్సహించాలని అన్నారు.

విద్యుదాఘాతంతో ఇద్దరికి గాయాలు

అఫ్జల్‌గంజ్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): సులబ్ కాంప్లెక్స్ దాబాపై నుంచి కంచెలేని ట్రాన్స్‌ఫార్మర్ పక్క నుంచి కిందకు దిగుతున్న ఇద్దరు చిన్నారులు ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై తీవ్రంగా గాయపడి ఉస్మానియాలో చికిత్స పొందుతున్నారు. ఈ సంఘటన సోమవారం బేగంబజార్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. వివరాల ఇలా ఉన్నాయి. గాంధీభవన్ పటేల్‌నగర్ ప్రాంతంలో ఉన్న సులబ్ కాంప్లెక్స్ దాబాపై అదే ప్రాంతానికి చెందిన రెహమాన్(13), జాహెద్ (12) ఆడుకుంటున్నారు. కొద్ది సేపటి తరువాత కిందికి ట్రాన్స్‌ఫార్మర్ పక్క నుంచి కిందికి దిగుతుండగా ప్రమాదవశాత్తు ఇద్దరూ విద్యుదాఘాతానికి గురై పెద్ద శబ్దంతో కిందపడిపోయారు. గమనించిన స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. గాయాలకు గురైన ఇద్దరినీ చికిత్స నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. ఈ ప్రమాదంలో రెహమాన్‌కు తీవ్ర గాయాలైనట్లు పోలీసులు తెలిపారు.

మీద లిఫ్ట్ పడి మహిళ దుర్మరణం

రాజేంద్రనగర్: లిఫ్ట్ మీద పడడంతో ఓ మహిళ అక్కడికక్కడే దుర్మరణం చెందింది. ఈ సంఘటన ఆదివారం సాయంత్రం శివరాంపల్లిలోని హెన్రీ మార్టీన్ ఇనిస్టిట్యూట్‌లో జరిగింది. శివరాంపల్లిలో హెన్రీ మార్టీన్ ఇనిస్టిట్యూట్ అనే క్రైస్తవ ఆధ్యాత్మిక శిక్షణాలయం ఉంది. అందులో వికారాబాద్‌కు చెందిన పద్మమ్మ(35) 12 సంవత్సరాలుగా పని చేస్తూ శివరాంపల్లి పిల్లర్‌నెంబర్ 294 వద్ద నివాసం ఉంటుంది. ఆదివారం ఆ సంస్థలో ఆమె పనిచేస్తూ.. లిఫ్ట్ ఎక్కాలని గ్రౌండ్‌ఫ్లోర్‌లో ఉండి లిఫ్ట్ బటన్ నొక్కింది. లిఫ్ట్ కిందకు రాలేదు.. కానీ డోర్ తెరుచుకుంది. ఆమె అడుగు ముందుకు వేసి కింద పడిపోయింది. వెంటనే ఆమె పైకి ఎక్కడానికి ప్రయత్నిస్తుండగా అప్పటికే పైనుంచి వచ్చిన లిఫ్ట్ ఆమెపై పడి అక్కడికక్కడే దుర్మరణం చెందింది. పద్మమ్మ భర్త ఆంజనేయులు అత్తాపూర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఎస్ఐ వెంకన్న కేసు దర్యాప్తు చేస్తున్నారు.

క్వారీ గుంతలో మునిగి బాలుడి మృతి

పేట్‌బషీరాబాద్, జూలై 29(ఆంధ్రజ్యోతి): స్నేహితులతో కలిసి సరదాగా ఈతకు వెళ్లిన బాలుడు క్వారీ గుంతలో మునిగి మృతి చెందాడు. జగద్గిరిగుట్ట పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం కైసర్‌నగర్‌లో నివాసం ఉండే సల్మాన్‌కు ముగ్గురు కుమారులున్నారు. వీరిలో పెద్ద కుమారుడు సోయల్(10) కైసర్‌నగర్‌లోని మదర్సాలో చదువుతున్నాడు. సోమవారం స్కూల్ కు సెలవు కావడంతో అదే ప్రాంతంలో ఉంటున్న ముగ్గురు స్నేహితులతో కలిసి సోయల్ ప్రగతినగర్ సమీపంలో ఉన్న క్వారీ గుంతలో ఈత కొట్టడానికి నలుగురు వెళ్లారు. క్వారీ గుంతలో దిగిన ముగ్గురు బయటకు రాగా ప్రమాదవశాత్తు సోయల్ క్వారీ గుంతలోని రాళ్లలో ఇరుక్కుపోయాడు. బయటకు రాలేక నీళ్లలో మునిగిపోయాడు. స్నేహితులు వారి బస్తీకి వచ్చి స్థానికులకు విషయం తెలిపారు. సమాచారం అందుకున్న బస్తీవాసులు క్వారీ గుంత వద్దకు చేరుకొని, జగద్గిరిగుట్ట పోలీసులకు సమాచారం అందించారు. క్వారీ గుంతలోకి స్థానికులు దిగి సోయల్‌ను వెతికి బయటకు తీసుకొచ్చారు. అప్పటికే బాలుడు మృతి చెందాడు. కుటుంబసభ్యుల రోదనతో ఆ ప్రాంతమంతా విషాదఛాయలు అలుముకున్నాయి. ఈ మేరకు జగద్గిరిగుట్ట పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.


క్వారీ నుంచి బాలుడి మృతదేహాన్ని బయటకు తెస్తున్న స్థానికులు

అస్తవ్యస్త రోడ్డుతో అవస్థలు

ప్రమాదాల బారిన పడుతున్న వాహనదారులు


గుంతలమయంగా మారిన రోడ్డు


సర్వీస్ రోడ్డు గుంతల్లో నిలిచిన నీరు

పేట్‌బషీరాబాద్, జూలై 29(ఆంధ్రజ్యోతి): ఆ రోడ్డులో ప్రయాణించాలంటే వాహనదారులు భయపడుతున్నారు. అడుగడుగునా గుంతలు, బురదమయంగా ఉండడంతో ఇదేం రోడ్డురా బాబూ అంటూ ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జీడిమెట్ల డివిజన్‌లోని పేట్‌బషీరాబాద్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం నుంచి ఫాక్‌సాగర్ చెరువు కట్ట మీదుగా రామిరెడ్డినగర్, సుభాష్‌నగర్, ఉమామహేశ్వరనగర్ వరకూ వెళ్లే రహదారిలో రెండు కిలోమీటర్ల మేర రోడ్డు గుంతలతో అస్తవ్యస్తంగా ఉంది. ఈ దారి గుండా ఎన్‌హెచ్-44కి వెళ్లే వారు అధికంగా రాకపోకలు సాగిస్తుంటారు. గుంతలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ప్రయాణికులు వాపోతున్నారు. వర్షాకాలంలో రోడ్డుపై పెద్దపెద్ద గుంతలు ఏర్పడ్డాయని, వీటి కారణంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేయించాలని కోరుతున్నారు.